సాక్షి
కుమురం భీం

మంగళవారం ; 7 ; మార్చి ; 2023



'కొలాంగూడ'లో నీటి కష్టాలు

తిర్యాణి మండలం మంగీ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. 9లో▸



వాంకిడి మండల కేంద్రంలో కామదహనం

కామ దహనం

ప్రకృతిలోని అందాలన్నీ ఆవిష్కరించే వసంత రుతువులో జరుపుకునే పండుగ హోలీ. వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా కామదహనం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో గల శ్రీకేశవనాథ స్వామి ఆలయంలో దోలోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు ఒజ్జల శిరీశ్‌శర్మ, నరేశ్‌శర్మ ఆధ్వర్యంలో కామదహనం నిర్వహించారు. ఆదివాసీ గ్రామాల్లో మంగళవారం హోలీ(దురాడి) వేడుకలు ప్రత్యేకంగా జరుపుకోనున్నారు.

- ఆసిఫాబాద్‌అర్బన్/కెరమెరి/వాంకిడి



కెరమెరిలో కర్రలకు పూలదారాలు కడుతున్న గిరిజనులు

న్యూస్‌రీల్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- డీటీవో గంధం లక్ష్మి



మాట్లాడుతున్న డీటీవో లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళలు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా రవాణా శాఖ అధికారి గంధం లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా పోటీపడి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీధర్, టీటీవో ఏవో అరుణ, అసిస్టెంట్ మేనేజర్ విశ్వనాథ్, ఎంఎఫ్ మధుసూదన్, సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్, వేణు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



చెట్లను పరిశీలిస్తున్న అంజనేయులుగౌడ్

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని రోళ్లపాడు గ్రామంలో ఈత వనాన్ని దహనం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులు గౌడ్ అన్నారు. రోళ్లపాడులో దహనమైన ఈత వనాన్ని సోమవారం మోకు దెబ్బ నాయకులు, గీత కార్మికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు ఈతవనం దగ్ధం కావడంతో జీవనోపాధి లేకుండా పోయిందన్నారు. గీత కార్మికుల పొట్టకొట్టిన వారు ఎంతటి వారైనా సహించేది లేదని, దోషులకు శిక్ష పడేవరకు పోరాడుతామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిరంజీవిగౌడ్, నాయకులు అన్నపూర్ణ మురళీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంతంగా పర్యావరణ పరీక్ష



పరిశీలిస్తున్న డీఐఈవో శ్రీధర్‌సుమన్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ఇంటర్ విద్యార్థులకు సోమవారం పర్యావరణ విద్య పరీక్ష నిర్వహించినట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 47 కళాశాలల్లో జనరల్ విభాగం విద్యార్థులు 4,448 మందికి గాను 4,144 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 788 మంది విద్యార్థులకు 676 మంది హాజరయ్యారని డీఐఈవో తెలిపారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ



కోచ్‌తో యశస్విని

కౌటాల(సిర్పూర్): కౌటాల మండల కేంద్రానికి చెందిన విద్యార్థి ఎస్.యశస్విని కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు కోచ్ అంజన్న తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్‌- 16 జిల్లా స్థాయి కరాటే, కుస్ ఫూ పోటీల్లో విజేతగా నిలిచిందన్నారు. త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో యశస్విని పాల్గొంటుందన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో ముప్పు

కాగజ్‌నగర్‌టౌన్: భూమిపై పెరుగుతున్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో భవిష్యత్తులో మానవాళికి ముప్పు పొంచి ఉందని సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ విద్యాభూషన్ పేర్కొన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సిర్పూర్‌పేపర్ మిల్లు, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు వ్యర్థాల నిర్వహణ, నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, అధ్యాపకులు ఉన్నారు.



ఆరోగ్య క్లినిక్‌లు

- ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా వైద్యపరీక్షలు
- జిల్లాలోని దహెగాం, గిన్నెదరి పీహెచ్‌సీల్లో సేవలు
- మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం నుంచి ప్రారంభం

ఆసిఫాబాద్‌అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేకంగా అతివలల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య మహిళా క్లినిక్‌లను ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన దహెగాం, గిన్నెదరి పీహెచ్‌సీల్లో ప్రతీ మంగళవారం మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే వైద్యసిబ్బంది హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ అందించారు.

ఇప్పటికే శిక్షణ

జిల్లాలో ఎంపిక చేసిన రెండు పీహెచ్‌సీల్లో మహిళలకు ప్రతీ మంగళవారం అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా ఆస్పత్రుల వైద్యులు, స్టాఫ్ నర్సులకు ఇటీవల హైదరాబాద్‌లో శిక్షణ అందించారు. పరీక్షల అనంతరం మొదట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందిస్తారు. మహిళా క్లినిక్‌లకు వచ్చేవారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారు. మొత్తం ఎనిమిది ప్యాకేజీల్లో 57 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. బీపీ, షుగర్, రక్తహీనత, రొమ్ము క్యాన్సర్, థైరాయిడ్, మూత్రకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, మోనోపాజ్ సమస్యలు, నెలసరి సమస్యలు వంటి పరీక్షలు చేస్తారు. పోషకాహార లోపాన్ని గుర్తించేందుకు మహిళలను పరీక్షిస్తారు. బరువు నియంత్రణ, ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. వైద్యం కోసం అవసరమైన వారి నుంచి రక్త నమూనాలు సేకరించి, ఆసిఫాబాద్‌లోని టీహబ్‌కు పంపిస్తారు. గైనిక్‌కు సంబంధించిన సమస్యలపై సేకరించిన శాంపిళ్లను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తామని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు.

దహెగాం, గిన్నెదరి పీహెచ్‌సీల్లో సేవలు

రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో వంద ఆరోగ్య మహిళా కేంద్రాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇటీవల రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్లు, వైద్యసిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవఖానాల్లో ఆరోగ్య మహిళా కేంద్రాలను ప్రారంభించనున్నారు. ఈ క్లినిక్‌లల్లో మహిళలకు 57 రకాల వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం జిల్లాలోని దహెగాం, గిన్నెదరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేసింది. ఆయా పీహెచ్‌సీల్లో ప్రతీ మంగళవారం ప్రత్యేకంగా మ హిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

వైద్యారోగ్య శాఖ ద్వారా ప్రతీ మంగళవారం మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్యం అందిస్తాం. జిల్లాలోని రెండు ఆస్పత్రుల్లో బుధవారం నుంచి ఆరోగ్య మహిళా క్లినిక్‌లను ప్రారంభిస్తాం. 57 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందజేస్తాం. ఇటీవల ఆయా పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులు ఇటీవల హైదరాబాద్‌లో శిక్షణ కూడా తీసుకున్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

– రామకృష్ణ, డీఎంహెచ్‌వో

హాస్టల్‌కు జ్వరం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

- తిర్యాణి బాలుర ఆశ్రమ పాఠశాలలో 25 మంది విద్యార్థులకు ఫీవర్
- చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

తిర్యాణి(ఆసిఫాబాద్): తిర్యాణి మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మూడు రోజులుగా మంచం పట్టారు. జలుబు, దగ్గుతోపాటు జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆశ్రమ పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. విద్యార్థులు జ్వరాల బారిన పడటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పాఠశాల ఆవరణలోనే మురుగు..

తిర్యాణి మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో 5 నుంచి పదో తరగతి వరకు 250 మంది వి ద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు స్నానం చేసిన నీళ్లు, వంట పాత్రలు శుభ్రం చేసిన మురుగునీరు బయటికి వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేదు. పాఠశాల ఆవరణలోనే మురుగునీరు నిల్వ ఉండటంతో ఈగలు, దోమలకు ఆవాసంగా మారుతోంది. అపరిశుభ్రమైన వాతావరణంతోనే పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న డీటీడీవో మణెమ్మ సోమవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. విద్యార్థులు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారని ఆస్పత్రి వైద్యుడు వెంకటేశ్ 'సాక్షి'కి తెలిపారు. ఆస్పత్రికి వచ్చిన విద్యార్థులందరికి రక్త పరీక్షలు నిర్వహించగా ఒకరికి మాత్రమే టైఫాయిడ్ పాజిటివ్‌గా తేలిందన్నారు. మిగిలిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేవని ఆయన పేర్కొన్నారు.

'విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు'



మాట్లాడుతున్న అధికారులు

కౌటాల(సిర్పూర్): సీఆర్పీలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా సెక్టోరియల్ అధికారి రాథోడ్ సుభాష్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరుగుతున్న యూడైస్‌ను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. సీఆర్పీలు పాఠశాలలను తనిఖీ చేయాలని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు పలు రికార్డులు పరిశీలించారు. విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారి సత్యనారాయణ, సీఆర్పీలు దేవన్న, లాలాజీ, రవి, లూలాజీ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఒడ్డెపల్లి గార్డెన్‌లో సోమవారం బీజేపీ యూత్ సశక్తీకరణ అభియాన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాలన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రభారీ రావుల రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొట్నాక విజయ్, దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణకుమారి, కోకన్వీనర్ సార రమేశ్‌గౌడ్, అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎగిసిపడిన 'భగీరథ'

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ సమీపంలో సోమవారం మిషన్ భగీరథ పైపులైన్ ఎయిర్ వాల్ లీకై నీరంతా ఉవ్వెత్తున ఎగిసిపడింది. జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న క్రమంలో ఓ వాహనం భగీరథ పైపులైనును ఢీకొట్టింది. పైపులైన్ ఎయిర్ వాల్ లీకై నీళ్లు వృథాగా పోయాయి. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ సిబ్బంది వెంటనే నీటి సరఫరాను నిలిపివేశారు. పైపులైనుకు మరమ్మతులు చేపడుతున్నట్లు ఏఈఈ శ్రీనివాస్ తెలిపారు.



సమన్వయంతో అర్జీలు పరిష్కరించాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ప్రజావాణిలో వచ్చే అర్జీలను జిల్లా అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సొంతిళ్లు లేక 40 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నామని, ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడకు చెందిన నూరుల్లా ఖాన్ అర్జీ పెట్టుకున్నాడు. ఒక కంటి చూపు లేదని, ఆసరా పింఛన్ మంజూరు చేయాలని చింతలమానెపల్లి మండలం టేకంగూడ గ్రామానికి చెందిన డోంగ్రె నేతాజీ విన్నవించాడు. దివ్యాంగుడిని అయినందున ఉపాధిహామీ పథకం కింద 150 రోజుల పనిదినాలు కల్పించాలని రెబ్బెన మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దుర్గం హరిలాల్ దరఖాస్తు చేసుకున్నాడు. 1964 నుంచి కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం శివారులో భూమి సాగు చేసుకుంటున్నామని, సదరు భూమికి పట్టా పాసుపుస్తకం మంజూరు చేయాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించాడు.

అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

ఆసిఫాబాద్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, సింగరేణి పరిధిలోని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. రహదారులు, వంతెనల నిర్మాణం, మరమ్మతులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. హట్టి, జోడేఘాట్ రహదారి నిర్మాణానికి అటవీ అనుమతులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల కింద చివరి ఆయకట్టు వరకు సాగునీరందేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్, మిషన్ భగీరథ ఈఈ వెంకటపతి, ఆర్‌అండ్‌బీ ఈఈ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

దయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు



ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: జిల్లాలోని కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసే డయాలసిస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి సోమవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో కోవిడ్ పరీక్షల నిర్వహణ కోసం ఉపయోగించిన ల్యాబ్‌లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో స్నేహభావంతో మెలుగుతూ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ మల్లికార్జున్, అధికారులు ఉన్నారు.

మహిళా దినోత్సవం విజయవంతం చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా దినోత్సవం విజయవంతం చేయాలని ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపారాణి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం మహిళల ఆటల పోటీలను ప్రారంభించారు. టగ్ ఆఫ్ వార్, బాల్ ఇన్ బాస్కెట్, షాట్‌పుట్ పోటీలను నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 8న గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లకు చెందిన సింగరేణి ఉద్యోగుల కుటుంబాల నుంచి మహిళలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో లత గుప్తా, పద్మస్వామి, పీఈటీ భాస్కర్, సేవా సమితి సభ్యులు రూప, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న స్వరూపారాణి

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం

చింతలమానెపల్లి(సిర్పూర్): మండల కేంద్రంలో సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో వరిగడ్డి దగ్ధమైంది. బాధిత రైతు బుధాజి తెలిపిన వివరాల ప్రకారం తన పంటపొలం నుంచి వరిగడ్డిని ట్రాక్టర్‌లో తీసుకువస్తుండగా విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ ఇంజన్‌ను వేరుచేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గమనించిన స్థానికులు నీళ్లు చల్లి మంటలు ఆర్పినప్పటికీ అప్పటికే గడ్డి మొత్తం కాలిపోయింది. ప్రమాదంలో సుమారు రూ.10వేల ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

కలప అక్రమ రవాణాచేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీవోలు

కాసిపేట(బెల్లంపల్లి): కలప అక్రమంగా రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకోనున్నట్లు జన్నారం, మంచిర్యాల, ఆసిఫాబాద్ ఎఫ్‌డీవోలు మాధవరావు, విజయ్‌కుమార్, వినయ్‌కుమార్ సాహు హెచ్చరించారు. సోమవారం కాసిపేట మండలం దేవాపూర్ రేంజ్ పరిధిలోని ఓరియంట్ సమావేశ మందిరంలో మంచిర్యాల, జన్నారం, ఆసిఫాబాద్ డివిజన్‌ల ఎఫ్‌డీవోలు అడవుల సంరక్షణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 గంటలు నిఘాతో పాటు నాకా బందీ, బీట్ పరిధిలో పెట్రోలింగ్ చేయాలని, పక్కన ఉన్న రేంజ్ సిబ్బందితో సమన్వయం ఏర్పర్చుకుని కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఆయా ప్రదేశాల్లో చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో రేంజ్ అధికారులు అప్పలకొండ, రమేశ్, అనిత, స్వామి, సుభాశ్, రత్నాకర్‌రావు, సంతోశ్, డెప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పోలీసులకు సవాల్‌గా మారిన ఆంధ్రా దొంగ

- కమిషనరేట్ పరిధిలో రెండేళ్లుగా వరుస చోరీలకు పాల్పడుతున్న వైనం
- అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం

నస్పూర్(మంచిర్యాల): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ ఎట్టకేలకు పోలీసులకు చిక్కినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున నస్పూర్ షిర్కే కాలనీలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడుతున్న దొంగను గుర్తించిన స్థానికులు అతన్ని చితకబాది పోలీసులకు అప్పగించారు. స్టేషన్‌కు తీసుకువెళ్లిన పోలీసులు అతని వేలిముద్రలు తీసుకుని ఇంటికి పంపించారు. వేలిముద్రలు పరిశీలించిన అధికారులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన పలు చోరీ ఘటనల్లో ఇతని వేలిముద్రలు సరిపోలినట్లు గుర్తించారు. వెంటనే తేరుకున్న స్థానిక పోలీసులు నస్పూర్ షిర్కే కాలనీలో నివాసం ఉంటున్న నిందితుడితో పాటు మరో అనుమానితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. సదరు నిందితుడు ఏపీలోని నెల్లూరు నివాసి. నస్పూర్‌కాలనీకి చెందిన ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకుని ఆటో నడుపుకుంటూ ఇక్కడే ఉంటున్నాడు. కమిషనరేట్ పరిధిలోని రామకృష్ణాపూర్, మందమర్రి, లక్సెట్టిపేట, గోదావరిఖని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు చోరీల్లో ఇతని ప్రమేయం ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై రవికుమార్‌ను సంప్రదించగా ఓ అనుమానితుడి అదుపులోకి తీసుకున్నామని, విచారణ అనంతరం త్వరలో వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

గిరి పల్లెల్లో రంగోత్సవం!



పప్పు, రొట్టెలతో నైవేద్యం సమర్పిస్తున్న ఆదివాసీలు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పండుగలు అన్నివర్గాలకు భిన్నంగా ఉంటాయి. తమదైన శైలిలో పండుగలు జరుపుకోవడంలో తమకు తామే సాటి. అన్ని పండుగల కంటే భిన్నంగా హోలీ వేడుకలు జరుపుకుంటారు. వేడుకలు తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తారు. నేడు గిరిజన ఆదివాసీ గ్రామాల్లో హోలీ(దురాడి) వేడుకలపై 'సాక్షి' కథనం.

- సంప్రదాయబద్ధంగా కాముడి దహనం
- నేడు దురాడి (హోలీ) సంబురం
- డోలు, భాజాలతో తరలివెళ్లిన ఆదివాసీలు
- ఏళ్ల కాలం నుంచి వస్తున్న ఆచారం

హోలీ వేడుకల్లో భాగంగా సోమవారం కామునిదహనం నిర్వహించారు. వెదురు కర్రలతో రెండు పులారాలను తయారు చేసి వాటికి ఐదుచోట్ల కుడుకలు, అప్పాలు, గోగుపూలు, చక్కెరపేర్లు, వంకాయ అమర్చారు. అనంతరం డోలు, సన్నాయి మేళాలతో గ్రామ పొలిమేర వరకు తరలివెళ్లి కామునిదహనం చేశారు. అంతకు ముందు రెండు వెదుర్లకు వృద్ధుడు, వృద్ధురాలు అని పేరు పెట్టి వాటికి పులారాలను కట్టారు. కిందిభాగంలో నిప్పంటించారు. గ్రామ పటేల్ పూజలు చేసిన అనంతరం వారి ఆచారం ప్రకారం మంటపై వరుసగా దూకారు. అనంతరం గ్రామంలోని ప్రతీ కుటుంబం నుంచి తీసుకువచ్చిన



ముస్తాబైన పులారాలు

పప్పు, రొట్టెలు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కాముని దహనం చేసిన చోటే రాత్రి బస చేశారు.

కుడుకలు ఇవ్వడం ఆచారం

ఆదివాసీల ఆచారంలో భాగంగా గ్రామ పటేల్, దేవారీలకు గ్రామస్తులంతా కుడుకలు ఇస్తారు. కుడుకలతో పాటు చక్కెర పేర్లు కూడా ఇస్తారు. ఇలా కుడుకలు ఇచ్చిన వారినే గ్రామస్తులుగా పరిగణిస్తారు. అనంతరం వాటిని లెక్కిస్తారు. ఈ కార్యమంతా కాముని దహనం రోజు జరుగుతుంది. అనంతరం వాటిని లెక్కిస్తారు. ఊర్లో ఎన్ని కుటుంబాలు ఉన్నాయో వాటికి సమానంగా కుడుకలు, పేర్లు వచ్చాయా? అని పరిశీలిస్తారు.

సతీయుగం నుంచి వస్తున్న ఆచారం

సతీయుగంలో రావణాసురుడు సీతను అపహరిస్తాడు. సీతకోసం రాముడు రావణాసురుడితో యుద్ధం చేస్తాడు. కానీ ఎన్ని బాణాలు వేసినా రావణాసురుడు మృతి చెందలేదు. రావణాసురుడి నాభిలో బాణం గుప్పిస్తే తప్ప మృతి చెందడని విభీషణుడు అసలు రహస్యం చెప్పాడు. దీంతో రాముడు రావణాసురుడి నాభిలో బాణం వేయడంతో మరణిస్తాడు. చెడుపై మంచికి జరిగిన విజయానికి గుర్తుగా భావించిన అయోధ్యవాసులు ప్రతీ సంవత్సరం ఈ హోలీ పండుగను జరుపుకుంటారని పురాణాలు చెబుతున్నాయి.

సహజసిద్ధమైన రంగులు ఆరోగ్యకరం

నిర్మల్‌చైన్‌గేట్: హోలీ వేడుకల్లో సహజ సిద్ధమైన రంగులు వాడితేనే ఆరోగ్యకరం. కెమికల్స్ కలిసిన రంగుల వాడకంతో చర్మం ఎర్రబడడం, దద్దుర్లు రావడం, తిమ్మిర్లతో పాటు కళ్లలో పడితే చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే హోలీ వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. గతంలో మోదుగ, బంతి, కుసుమ పూల నుంచి పసుపు రంగు, గోరింటాకు నుంచి ఆకుపచ్చ రంగు, ఎర్రచందనం, జాప్రా మొక్కల నుంచి ఎరుపు రంగు, వాయిలాకుల నుంచి నలుపు రంగును తయారు చేసేవారు. వీటి ఆకులు, పూల రెక్కలు, విత్తనాలను వేడి నీటిలో బాగా ఉడకబెట్టి తయారుచేసిన రంగులు ఆరోగ్యానికి శ్రేయస్కరం. నిమ్మ, పసుపు, కుంకుమను వాడడంతో తయారయ్యే ఈ రంగులు వసంత రుతువు ప్రారంభంతో వాతావరణంలో కలిగే మార్పులను శరీరానికి తట్టుకోగలిగే శక్తిని అందిస్తాయని ఆయుర్వేద వైద్యులు సూచిస్తున్నారు.

రసాయన రంగులతో జాగ్రత్త



హోలీకి వినియోగించే రసాయన రంగులతో చర్మవాధులు వచ్చే ప్రమాదం ఉంది. గ్రీస్, ఆయిల్ వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు. ఇలాంటి రంగులతో చర్మంపై దురద, దద్దుర్లు, ఇతర చర్మవ్యాధులు వస్తాయి.

– డాక్టర్ అమరేశ్వర్, చర్మవ్యాధుల నిపుణులు

ప్రకృతి సిద్ధమైన రంగులే మేలు



ప్రకృతి సిద్ధంగా లభించే రంగులు వాడడంతోనే ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు జరుగుతుంది. కళ్లలో రంగుపడితే నలవడం, రుద్దడం చేయకుడదు. చల్లని నీటితో కళ్లను శుభ్రం చేసి అవసరమైతే నేత్ర వైద్యుడిని సంప్రదించాలి.

– డాక్టర్ సురేశ్, నేత్ర వైద్య నిపుణులు



మంటల పై నుంచి దూకుతున్న ఆదివాసీలు

అన్ని పండుగలకు భిన్నంగా..



అన్ని పండుగలకంటే భిన్నంగా హోలీని జరుపుకుంటాం. అంతా ఒక్కటై కాముని పున్నమిని జరుపుకుంటాం. ఇందులో కుడుకల ఆచారం చాలా ముఖ్యమైనది. కాముని దహనం తర్వాత అందరం రాత్రంతా ఇక్కడే బస చేయడం ఆనవాయితీ.

– పెందోర్ భీంరావు, గ్రామ పటేల్, చిన్నసాకడ

తరాలుగా వస్తున్న ఆచారం



మాతాత ముత్తాతల నుంచి వస్తున్న ఆచారమిది. అన్ని గ్రామాల్లోని ఆదివాసీలు ఈ పండుగలకు అతీతులే. ప్రతిఒక్కరూ ఈ ఆచారాలు పాటించాల్సిందే. హోలీ వేడుకలను పురుషులు మాత్రమే జరుపుకుంటారు.

– పెందోర్ మోతీరాం, ఎంపీపీ, కెరమెరి

కుమారుడి వివాహానికి వినూత్న ఆహ్వానం



ఆహ్వానిస్తున్న సర్పంచ్ జయలక్ష్మి

చెన్నూర్‌రూరల్: ఎవరైనా తమ ఇంట్లో జరిగే వివాహానికి సకుటుంబ సమేతంగా రావాలని శుభలేక ఇచ్చి లేదా బొట్టుపెట్టి ఆహ్వానిస్తారు. కానీ తమ కుమారుడి వివాహానికి రావాలని కొమ్మెర సర్పంచ్ జయలక్ష్మి వినూత్నరీతిలో ఆహ్వానం పలుకుతున్నారు. తాళ్లపల్లి జయలక్ష్మి, బక్కయ్య దంపతుల కుమారుడు కిరణ్ వివాహం ఈ నెల 9న బీరెల్లిలో జరుగనుంది. సదరు సర్పంచ్ ఇంటింటికీ వెళ్లి చీర, టవల్, శుభలేక ఇచ్చి తమ కుమారుడి వివాహానికి రావాలని ఆహ్వానిస్తున్నారు. గ్రామంలో సుమారు 400 వరకు నివాసాలు ఉండగా ఇంటింటికీ వెళ్లి చీర, టవల్ శుభలేక ఇచ్చి వివాహానికి రావాలని కోరుతున్నారు.

కార్మిక సమస్యలపై అలుపెరగని పోరాటం



హెచ్‌ఎంఎస్‌లో చేరుతున్న కార్మికులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి హెచ్‌ఎంఎస్ అలుపెరగని పోరాటాలు చేస్తోందని ఆ యూనియన్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. సోమవారం ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీకి చెందిన పలువురు కార్మికులు హెచ్‌ఎంఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యలను గాలికి వదిలేసి పైరవీలకే పెద్దపీట వేస్తున్నాయన్నారు. కార్మికులకు నిత్యం అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తున్న ఏకైక సంఘం హెచ్‌ఎంఎస్ ఒక్కటేనన్నారు. సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్, ఏరియా కార్యదర్శి ఎస్‌కే ఇనూస్, పంచాక్షరీ, కిష్టస్వామి, పిట్ కార్యదర్శులు శ్రీనివాస్, సంపత్, ఆరీఫ్ పాల్గొన్నారు.

మహిళలు హక్కులకోసం పోరాడాలి

బెల్లంపల్లి: అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని మహిళలపై జరిగే రాజ్యహింస, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా జరుపుకోవాలని ఆదివాసీ విప్లవ మహిళా సంఘం(ఏవీఎంఎస్), విప్లవ మహిళా సంఘం(వీఎంఎస్) సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మనోన్మాదాన్ని రెచ్చగొడుతోందని, అక్రమంగా అరెస్టులు చేయిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మనువాద సిద్ధాంతాలకు, పితృస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మహిళలు సమాన హక్కులకోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కనక భీంరావ్

ఉట్నూర్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్ పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన గిరిజనుల నుంచి 34 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్య పరిష్కారం కోసం అందించే అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో పీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, ఈఈటీడబ్ల్యూ భీంరావ్, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

- అగ్నిప్రమాదంలో కిరాణ షాపు దగ్ధమవడంతో కుటుంబం రోడ్డున పడిందని, జీవనోపాధి కోసం దుకాణం పెట్టుకోవడానికి ఐటీడీఏ ద్వారా రుణం అందించాలని ఆదిలాబాద్ మండలం తిప్పాకు చెందిన అడ మోహపత్ అర్జీ పెట్టుకున్నాడు.
- తన పంట సాగుకు గిరి వికాసం పథకం ద్వారా విద్యుత్ మోటార్, బోర్ బావి మంజూరు చేయాలని రెబ్బెన మండలం సింగాల్‌గూడకు చెందిన నాగవత్ విన్నవించాడు.
- స్వయం ఉపాధి కోసం తమకు చేపలు పట్టడంలో ఐటీడీఏ ద్వారా శిక్షణ ఇప్పించాలని భీమారం మండలం రాంపూర్‌కు చెందిన గిరిజనులు వేడుకున్నారు.
- డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని భీంపూర్ మండల కేంద్రానికి చెందిన తుమ్రా తుల సీరాం అర్జీ పెట్టుకున్నాడు.
- తాను సాగు చేసుకుంటున్న పోడు భూమికి అటవీ హక్కుల పత్రం మంజూరు చేయాలని జైనూర్ మండలం పోచంలొద్దికి చెందిన కనక మాన్కు వేడుకున్నాడు.

అక్రమ పట్టాలపై అధికారుల విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

- 'సాక్షి' కథనాలతో కదిలిన యంత్రాంగం

జన్నారం(ఖానాపూర్): సీలింగ్ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న సంఘటనపై 'సాక్షి'లో వచ్చిన కథనాలతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ ఆదేశాలతో సోమవారం మంచిర్యాల డీఐవో గంగాధర్, తహసీల్దార్ వెంకటకిషన్ సిబ్బందితో కలిసివెళ్లి చెరువువద్ద విచారణ జరిపారు. చెరువుచుట్టూ బౌండరీలను గుర్తించారు. రికార్డుల ప్రకారం అక్రమ పట్టా అని తేలడంతో నోటీసులు అందజేశారు.

అసలేం జరిగింది?

మండలంలోని సింగరాయిపేట్ శివారులో వెంకట సంపత్‌రావు, ఆజాద్ సుభాష్ చక్రధర్‌రావు, విజయరావు, శ్రీనివాస్‌రావు పేరుతో 42.33 ఎకరాల జాయింట్ పట్టా ఉంది. సీలింగ్ యాక్టు 1975 ప్రకారం మిగులు భూమి కింద ఇందులో నుంచి 22.22 ఎకరాల భూమిని 11 మంది పేరున పట్టా చేశారు. దామోదర్‌రావు పేరుపై ఐదెకరాలు, వెంకటమ్మ పేరుపై 2.20 ఎకరాల భూమి ఉంది. ఇట్టి భూమిని 2020లో తపాలాపూర్ గ్రామానికి చెందిన సీపతి రమణ పేరుపై ఐదెకరాలు, నైనాల విజయ్‌కుమార్ పేరుపై 2.20 ఎకరాలు పట్టా మార్పిడి చేసుకున్నారు. అసైన్‌మెంట్ యాక్టు ప్రకారం సీలింగ్ భూమి వారసుల పేరుపై మాత్రమే పట్టా మార్పిడి చేయవచ్చు. కానీ అప్పటి తహసీల్దార్ రాజ్‌కుమార్ వారసులు కాకున్నా రమణ, విజయ్‌కుమార్ పేరుపై పట్టా మార్పిడి చేశారు. సదరు వ్యక్తులు రైతుబంధు, పంటరుణం కూడా తీసుకున్నారు.

నోటీసులు ఇస్తాం

సింగరాయిపేట్ సీలింగ్ భూమి అక్రమ పట్టా విషయంలో వారసులకు కాకుండా ఇతరులపై అక్రమంగా పట్టా చేసినట్లు తేలింది. ఆన్‌లైన్ రికార్డులు తీయించి కలెక్టర్, ఆర్డీవోలకు పంపించాం. పూర్తి విచారణ జరిపి సదరు వ్యక్తులకు నోటీసులు ఇస్తాం. – వెంకటకిషన్ తహసీల్దార్

ప్రజాకవి అంజయ్యను విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న రాజేందర్

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమానికి తన పాటలతో ఊపు తీసుకువచ్చిన ప్రజాకవి గూడ అంజయ్య, అతని కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని గూడ రాజేందర్ విమర్శించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో ఆయన పాటలు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. అంజయ్య కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ ఇంత వరకూ నెరవేర్చలేదన్నారు. దళితుడు కావడం వల్లే సీఎం వివక్ష చూపుతున్నారన్నారు. అంజయ్య అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకుండా అవమానానికి గురిచేశారన్నారు. పోరాటాల గడ్డ బెల్లంపల్లిలో గూడ అంజయ్య యాదిలో సాంస్కృతిక సభ నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నాన్న అడుగు జాడల్లో సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తున్నానన్నారు.

తల్లిదండ్రులు లేని బాలుడికి చేయూత



సరుకులు అందజేస్తున్న మాలి సంఘం నాయకులు

చింతలమానెపల్లి: మండల కేంద్రానికి చెందిన గిరిజన బాలుడు మేకల భీమన్నకు మాలి సంఘం నాయకులు ఆపన్నహస్తం అందించారు. భీమన్న స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతిచెందగా వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్యల దగ్గర ఉంటున్నాడు. మాలిసంఘం అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు బాలుడికి సోమవారం 25కిలోల బియ్యం, నోట్‌బుక్స్, బట్టలు, రగ్గులు అందజేశారు. సంఘం చింతలమానెపల్లి, కౌటాల మండలాల అధ్యక్షులు నికాడి బాపురావు, ఆదె వసంత్ పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి(సిర్పూర్): మండల కేంద్రంలోని దుబ్బగూడలో సోమవారం అధికారులు బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు తహసీల్దార్ మష్కూర్ అలీ, శిశు అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎస్సై విజయ్ కుమార్, ఎంపీడీఓ మహేందర్ దుబ్బగూడకు చేరుకున్నారు. పెళ్లి కుమార్తె వివరాలు తెలుసుకుని మైనరని తేలడంతో వివాహం నిలిపివేయాలని బాలిక తల్లిదండ్రులకు సూచించారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని, మైనర్లకు వివాహం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

బెజ్జూర్: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి మహేష్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్య ను అభ్యసిస్తున్న ఓ విద్యార్థినికి ఈ నెల 9న వివాహం జరిపించేందుకు తల్లిదండ్రులు నిశ్చయించారు. విషయం తెలుసుకున్న ఆయన సోమవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థినికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన వెంట కేజీబీవీ ప్రత్యేక అధికారి అరుణ, కౌన్సిలర్లు చంద్రశేఖర్, ఝాన్సీరాణి, సిబ్బంది ఉన్నారు. జెండర్ అండ్ ఈక్విటీ జిల్లా కోఆర్డినేటర్ స్వర్ణ, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ సుభాష్ రాథోడ్ కేజీబీవీని సందర్శించారు.